ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ

ఖైరతాబాద్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల సందర్భంగా పోలింగ్ బూత్‌లలో విధులు నిర్వహించే ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ శిబిరాలు ప్రారంభమయ్యాయి. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఖైరతాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో విధులు నిర్వహించనున్న 800మంది ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు సోమవారం ఖైరతాబాద్ డిగ్రీ కళాశాలలో శిక్షణ ప్రారంభమైంది. తొలిరోజు ఒక్కో సెషన్లలో 200మంది చొప్పున తొలిరోజు ఉదయం, మధ్యాహ్నం జరిగిన శిక్షణలో 400మందికి అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్లు శిక్షణ ఇచ్చారు. మిగతా 400 మందికి మంగళవారం శిక్షణ ఉంటుందని పార్లమెంట్ స్థానం సహాయ రిటర్నింగ్ అధికారి, ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ హేమంత్ భోర్ఖాడే తెలిపారు. ఎన్నికల ముందు రోజున ఈవీఎం, వీవీ పాట్‌లతో పాటు పోలింగ్ స్టేషనరీ సేకరించి పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్లడం, ఎన్నికల రోజున బూత్ ఏజెంట్ల ముందు మాక్ పోల్ నిర్వహించడం, ఎన్నికలు సజావుగా జరపడం, పోలింగ్ పూర్తయిన అనంతరం ఆయా ఫారాలను నింపడం, ఈవీఎంల పనితీరు, వీవీ పాట్‌ల పనితీరు తదితర విషయాల్లో వీరికి శిక్షణ ఇస్తున్నట్టు ఖైరతాబాద్ నియోజకవర్గ ఎన్నికల అధికారిణి, జూబ్లీహిల్స్ సర్కిల్ ఉప కమిషనర్ ప్రశాంతి తెలిపారు. మంగళవారం మరో 400 మందికి ఇదే ప్రాంతంలో శిక్షణ ఉంటుందని ఆమె తెలిపారు.



అధికారులతో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ హేమంత్ భోర్ఖాడే

సరుకు రవాణాలో దక్షిణమధ్యరైల్వే రికార్డు





సికింద్రాబాద్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): గడిచిన ఆర్థిక సంవత్సరంలో సరుకు రవాణ రంగం, సరుకు రవాణ ఆదాయంలో దక్షిణమధ్యరైల్వే అత్యుత్తమ పనితీరు ప్రదర్శించింది. మునుపెన్నడూ లేనివిధంగా తొలిసారిగా సరుకు రవాణాలో 140 మిలియన్ టన్నుల మార్కును అధిగమించి 141.117 మిలియన్ టన్నుల సరుకు లోడింగ్ సాధించింది. గత ఏడాదితో పోలిస్తే 8.785 మిలియన్ టన్నులు అధికం కావడం గమనార్హం. అలాగే 2023-24 ఆర్థిక సంవత్సరంలో సరుకు రవాణా ఆదాయంలో మొట్టమొదటిసారిగా 13వేల కోట్ల రూపాయల మార్కును అధిగమించి, 13,438.76 కోట్ల రూపాయలను ఆర్జించింది. గత ఏడాదితో పోలిస్తే 506 కోట్ల రూపాయలను అధికంగా ఆర్జించడం విశేషం. బొగ్గు, సిమెంట్, ఎరువుల, ఆహార ధాన్యాల రవాణాలో వృద్ధి కారణంగా దక్షిణమధ్యరైల్వే ఈ ఘనత సాధించినట్టు అధికారులు వెల్లడించారు. జోన్‌లో సరుకు రవాణాలో ప్రధాన వస్తువైన బొగ్గును 2022-23లో 67.18మిలియన్ టన్నులు రవాణా చేయగా, 2023-24లో 70.522 మిలియన్ టన్నుల లోడింగ్ చేసింది. రెండో అతిపెద్ద రవాణా వస్తువైన సిమెంట్‌ను 2022-23లో 34.855 మిలియన్ టన్నుల లోడింగ్ చేయగా, 2023-24లో 36.117 మిలియన్ టన్నుల లోడింగ్ చేసింది.

విలేకరి ఆత్మహత్య



రఘు(ఫైల్)

బోరబండ, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): క్షణికావేశంలో ఉరి వేసుకొని ఓ టీవీ చానల్ విలేకరి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోరబండ సైట్-3 ప్రాంతానికి చెందిన డెరంగుల రఘు(49) ఓ టీవీ చానల్‌లో పని చేస్తున్నాడు. ఎప్పటిలాగే విధులకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చాడు. ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు వెలాడుతుండగా గమనించిన పొరుగు వారు ఉరిని తొలగించి వెంటనే ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని చెప్పారు. దీంతో మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీరుబాటిల్, ఇనుప రాడ్‌లతో దాడి

బంజారాహిల్స్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): కారణం లేకుండా ఇద్దరు అగంతకులు బీరు బాటిల్, ఇనుప రాడ్‌తో స్నేహితులపై దాడిచేశారు. కాకతీయ హిల్స్‌కు చెందిన షైపాటి భార్గవ్ వ్యాపారి. మార్చి 31న తన స్నేహితులతో కలిసి ఫిలింనగర్ కేఫ్ మిలాంజ్‌కు కారులో వచ్చాడు. అక్కడ పార్కింగ్ లేకపోవడంతో కేఫ్ మిలాంజ్ సిబ్బంది సూచన మేరకు పోపోబాబ్ ఎదురుగా కారు పార్కింగ్ చేశాడు. నడుచుకుంటూ కేఫ్ మిలాంజ్‌కు వెళ్తుండగా నల్లటి టీ షర్ట్, ఎరుపు టీ షర్ట్ వేసుకున్న గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు వచ్చి భార్గవ్‌పై చేయి చేసుకున్నారు. ఓ అగంతకుడు బీరు బాటిల్‌తో కొట్టేందుకు ప్రయత్నించాడు. భార్గవ్ తన స్నేహితులను తీసుకొచ్చాడు. ఇద్దరు అగంతకులు రెచ్చిపోయి స్నేహితులపై బీరు బాటిళ్లు, ఇనుప రాడ్‌తో దాడి చేశారు. పక్కనే పబ్‌లో ఉన్న బౌన్సర్లు వచ్చి గొడవ ఆపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డ్రైనేజీ పైప్‌లైన్ గోతిలో పడి వృద్ధుడి మృతి

బంజారాహిల్స్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): జలమండలి నిర్లక్ష్యం వృద్ధుడి ప్రాణాలు తీసింది. డ్రైనేజీ మరమ్మతుల కోసం తవ్విన గోతుల వద్ద రక్షణ ఏర్పాట్లు చేయలేదు. ప్రమాదవశాత్తు అందులోపడి వృద్ధుడు మృతి చెందాడు. షేక్‌పేట మినిగుల్షన్ కాలనీకి చెందిన గులాం మహ్మద్(78) బీహెచ్‌ఈఎల్‌లో పనిచేసి పదవీ విరమణ పొందారు. మార్చి 31న ఇంటి నుంచి ద్విచక్రవాహనంపై బయట కెళ్లాడు. టోలిచౌకి క్రాస్ రోడ్సులోని సూర్యనగర్ చేరుకోగానే వాహనం అదుపు తప్పింది. దీంతో గులాం మహ్మద్ అక్కడే డ్రైనేజీ పైప్‌లైన్ కోసం జలమండలి అధికారులు తవ్వి వదిలేసిన గోతిలో పడ్డాడు. తీవ్రంగా గాయపడ్డ ఆయనను స్థానికులు నదీంకాలనీలో ఆపిల్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మహ్మద్ కుమారుడు అమీర్ సయ్యద్ మెరుగైన వైద్యం కోసం తండ్రిని జూబ్లీహిల్స్ అపోలోకు తరలించారు. చికిత్స పొందుతూ మహ్మద్ సోమవారం మృతి చెందాడు. కాంట్రాక్టర్, జలమండలి అధికారులు పనులు నిర్వహించేందుకు గోయ్యి తవ్వి ఎలాంటి రక్షణ ఏర్పాట్లు చేయకపోవడం వల్లనే తన తండ్రి మరణించాడని అమీర్ ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువతిని మోసగించిన యువకుడి రిమాండ్

ఖైరతాబాద్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): యువతికి మాయమాటలు చెప్పి మోసగించిన కేసులో ఓ యువకుడిని ఖైరతాబాద్ పోలీసులు సోమవారం రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఖైరతాబాద్ ఇందిరానగర్ కాలనీకి చెందిన అబ్దేష్ శ్రవణ్ అలియాస్ బన్నీ(19) జొమాటో బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఇంటి సమీపంలో ఉండే యువతిని మాయమాటలతో ప్రేమిస్తున్నట్టు నమ్మించాడు. ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మించి యాదగిరి గుట్టకు తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. యువతి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు సాంకేతికంగా పరిశోధించి యాదగిరి గుట్ట నుంచి తీసుకొచ్చి సోమవారం నాంపల్లి 1వ మెట్రో ఆటిటన్ మెజిస్ట్రేట్ కోర్టు ఎదుట హాజరు పరచగా రిమాండ్‌కు తరలించారు.

పాల ప్యాకెట్లను దొంగిలిస్తున్న యువకుడి అరెస్టు

పంజాగుట్ట, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): తెల్లవారుజామున పాల ప్యాకెట్లను దొంగిలిస్తున్న ఓ యువకుడిని పంజాగుట్ట పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... బాలానగర్ రాజుకాలనీకి చెందిన దత్తు కుమార్(29) తెల్లవారుజామున వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ పాల దుకాణాల వద్ద ప్యాకెట్లను దొంగలించే వాడు. గతనెల 31న ఎప్పటిలానే ఇంటి నుంచి వాహనంపై బయలుదేరాడు. పంజాగుట్ట ద్వారకాపురి కాలనీలో ఓ పాల దుకాణం వద్ద మూడు ట్రేలలో ఉన్న పాల ప్యాకెట్లను దొంగలించాడు. ఉదయం వచ్చిన దుకాణం యజమాని వెంకటేష్ పాలు తక్కువ రావడంతో గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతడి ఫిర్యాదు మేరకు పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించి దత్తు కుమార్‌ను అరెస్టు చేశారు.

గంజాయి విక్రయిస్తున్న మహిళ..

రాయదుర్గం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): నానక్‌రాంగూడలో కిరాణాషాపులో గంజాయి విక్రయిస్తున్న ఓ మహిళను మాదాపూర్ ఎస్‌ఓటీ పోలీసులు ఆదివారం రాత్రి అరెస్టు చేశారు. ఆమె నుంచి 300 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నానక్‌రాంగూడలో కిరాణాషాపు నడుపుతున్న అనురాధభాయి కొంతకాలంగా గంజాయి కూడా విక్రయిస్తోందని మాదాపూర్ ఎస్‌ఓటీ పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఆదివారం రాత్రి కిరాణాషాపుపై దాడిచేసి 39ప్యాకెట్లల ఉన్న 300గ్రాముల గంజాయిని, రూ.1200, సెల్‌ఫోను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం నిందితురాలని గచ్చిబౌలి పోలీసులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ అంజనేయులు తెలిపారు.

మానసిక పరిస్థితి సరిగా లేని వ్యక్తి ఆత్మహత్య

గాజులరామారం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మానసిక పరిస్థితి సరిగా లేని ఓవ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సూరారం రాజీవ్‌గృహకల్పలో నివాసముంటున్న నర్సింహ కుమారుడు దత్త(30)భార్య, భర్త గొడవ పడ్డారు. దత్త తన ఎడమచేతిని కోసుకొని, తన గది తలుపులు వేసుకొన్నాడు. బయట ఉన్న తల్లి, భార్య తలుపులు కొట్టినా తీయలేదు. దీంతో పోలీసులకు తెలిపారు. పోలీసులు గది తలుపులు పగలగొట్టి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకొన్నాడు. మృత దేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. నెల నుంచి తన కుమారుడు పిచ్చిగా ప్రవర్తిస్తున్నాడని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

పనిచేసే కార్యకర్తలకు పార్టీలో గుర్తింపు



యూత్ కాంగ్రెస్‌లో పదవులు పొందిన వారికి నియామక పత్రాలు అందజేసిన విజయారెడ్డి

బంజారాహిల్స్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం శ్రమించే కార్యకర్తలను కాంగ్రెస్ పార్టీ తప్పకుండా గుర్తిస్తుందని టీపీసీసీ కార్యదర్శి పి. విజయారెడ్డి అన్నారు. బంజారాహిల్స్‌కు చెందిన నేతలు టి.సాయి కిరణ్‌ను జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా, బి.నర్సింహగౌడ్‌ను యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు నిం గాల ప్రభాకర్ ముదిరాజ్ నియమించిన నేపథ్యంలో వారికి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా విజయారెడ్డి మాట్లాడుతూ... ఈసారి సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానాన్ని ఖచ్చితంగా గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నేతలు ధన్‌రాజ్ రాథోడ్, సత్యనారాయణ, యూత్ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు శ్రవణ్ ముదిరాజ్ పాల్గొన్నారు.

వర్క్‌షాప్‌లతో విస్తృత ప్రయోజనాలు

- జేఎన్‌టీయూ రెక్టార్ విజయకుమార్ రెడ్డి



వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న వర్సిటీ రెక్టార్ విజయకుమార్ రెడ్డి, వేదికపై ప్రోగ్రామ్ కోఆర్డినేటర్లు భ్రమర, రాంజీ తదితరులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): విజ్ఞానదాయక అంశాలపై వర్క్‌షాప్‌లు నిర్వహించడంవల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయని జేఎన్‌టీయూ రెక్టార్ డాక్టర్ కె.విజయకుమార్ రెడ్డి అన్నారు. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'క్వాడ్‌కాప్టర్ వర్క్‌షాప్' సోమవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా డాక్టర్ విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు తరగతి గదిలో నేర్చుకున్న పాఠ్యాంశాలను వర్క్‌షాప్‌లో పరిశీలన చేసే అవకాశం ఉంటుందన్నారు. ఏదేని యంత్రాన్ని పరిశీలించినప్పుడు దాని పనితీరు, ప్రయోజనాల గురించి అవగాహన మెరుగవుతుందన్నారు. మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు దృఢమైన లక్ష్యాన్ని ఏర్పరచుకొని, ఆ మేరకు కృషిచేస్తే జీవితంలో తాము అనుకున్నవన్నీ సాధించగలరని చెప్పారు. కార్యక్రమంలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఇ.రాంజీ, ప్రోగ్రాం కోఆర్డినేటర్లు డాక్టర్ భ్రమర, డాక్టర్ ప్రసన్న, బ్రహ్మోస్త్ర సంస్థ ప్రతినిధులు సుభాష్ కుప్పుస్వామి, విష్ణు, స్టూడెంట్ కోర్డినేటర్లు రణధీర్, సాయి విశాల్, శ్రీజారెడ్డి, మనస్వి తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌బోర్డులో 16 మంది ఉద్యోగ విరమణ



ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులతో ఎండీ సుదర్శన్ రెడి

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): జీవితంలో ఉద్యోగ విరమణ అనేది ఒక ముఖ్యమైన ఘట్టమని ఎండీ సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం ఖైరతాబాద్‌లోని వాటర్‌బోర్డు ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్న ఇద్దరు జనరల్ మేనేజర్లు సహా.. 16 మంది ఉద్యోగులకు పదవీ విరమణ చేయగా, వారిని ఎండీ సుదర్శన్ రెడ్డి అభినందించారు. ఉద్యోగ విరమణ ద్వారా లభించే గ్రాట్యూటీ వంటి తదితర ప్రయోజనాలు చెక్కు రూపంలో అందజేశారు. ఈసందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ... అత్యవసర సేవల విభాగంలో పనిచేసిన వారికి సొంత వారితో సమయం గడిచే అవకాశం చాలా తక్కువగా ఉంటుందని, ఉద్యోగ రీత్యా కుటుంబ సభ్యులతో గడపలేని వాళ్లు.. రిటైర్మెంట్ తర్వాత ఆ లోటును పూడ్చుకోవచ్చని తెలిపారు. భవిష్యత్తులో మరింత సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డైరెక్టర్ శ్రీధర్ బాబు, స్వామి, విజయరావు, సీజీఎం మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, జీఎం సరస్వతి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ సాఫ్ట్‌బాల్ విజేత తెలంగాణ



తెలంగాణ జట్టు క్రీడాకారులు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ బాలికల జట్టు విజేతగా నిలిచింది. సోమవారం ఔరంగాబాద్‌లో ముగిసిన ఫైనల్లో తెలంగాణ 3-1తో పంజాబ్‌ను ఓడించి, ట్రోఫీ దక్కించుకుంది. తెలంగాణ జట్టును రాష్ట్ర సాఫ్ట్‌బాల్ సంఘం అభినందించింది.

అంతర్గత విద్యుత్ సమస్యలకు బాధ్యులను చేయొద్దు



సమావేశంలో తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్‌యాక్షన్ కమిటీ చైర్మన్ సాయిబాబా, కన్వీనర్ రత్నాకర్‌రావు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరా అంతరాయాలకు తమ తప్పిదం లేకున్నా.. విద్యుత్ సంస్థల యాజమాన్యాల, అధికారుల, ఇంజనీర్ల సిబ్బంది లోపంగా అసత్య ప్రచారం చేస్తూ, అంతర్గత విద్యుత్ సమస్యలకు తమను బాధ్యులను చేయొద్దని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ కోరింది. జేఏసీ ఆధ్వర్యంలో ఖైరతాబాద్ మిం ట్ కాంపౌండ్ తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్-1104 కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. జేఏసీ చైర్మన్ సాయిబాబా, కన్వీనర్ పి.రత్నాకర్‌రావు, కో కన్వీనర్ పి.బీసీ రెడ్డి, వేణుగోపాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని కేటగిరీల్లో నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు తామంతా అహర్నిశలు కృషిచేస్తున్నామని తెలిపారు. తమకు సంబంధం లేని అంతర్గత సాంకేతిక సమస్యల కారణంగా సరఫరాలో అంతరాయం ఏర్పడినా, దాన్ని తమ తప్పిందగా చూపిస్తూ తప్పుడుప్రచారం చేయడం విద్యుత్ సిబ్బంది, అధికారుల మనోధైర్యం దెబ్బతీస్తుందని వారు అన్నారు. ప్రస్తుత సీజన్లో అంచనాలకు మించి డిమాండ్ వస్తున్నా తమ సిబ్బంది, ఇంజనీర్ల అనునిత్యం అప్రమత్తంగా ఉంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో గతేడాది 15,497 మెగావాట్లుగా ఉన్న గరిష్ఠ విద్యుత్ డిమాండ్ ఇప్పటికే 15,623 మెగావాట్లకు చేరిందన్నారు. డిమాండ్ పెరిగినా విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయాలు లేకుండా పనిచేస్తున్నామన్నాని, భవిష్యత్‌లో మరింత డిమాండ్ పెరిగినా నిరంతర విద్యుత్‌సరఫరా చేస్తామన్నారు.

ఖైరతాబాద్ జోన్‌లో రూ. 501 కోట్ల పన్ను వసూలు

ఖైరతాబాద్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోన్ పరిధిలో 23-24 ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 501 కోట్ల ఆస్తిపన్ను వసూలు చేశారు. ఈ జోన్‌లోని ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, మెహిదీపట్నం, కార్వాన్, గోషామహల్ సర్కిళ్ల ద్వారా మొత్తం 546.08 కోట్ల పన్ను లక్ష్యం విధించగా అందులో రూ. 501 కోట్లు వసూలు చేశారు. మార్చిలో చివరి వరకు రూ. 149.10 కోట్లు వసూలు చేయగా చివరి రోజు మార్చి 31వ తేదీన రూ.34.82 కోట్లు వసూలు చేశారు. ఈ జోన్‌లో ధనికులు, పెద్ద వ్యాపార సంస్థలున్న జూబ్లీహిల్స్ సర్కిల్‌లో రూ. 213.21 కోట్ల పన్ను వసూళ్ల లక్ష్యం ఉండగా అందులో రూ. 184.34 కోట్లు వసూలు చేశారు. ఆర్థిక సంవత్సరం చివరి రోజైన మార్చి 31వ తేదీన ఒక్కరోజు రూ. 7.89 కోట్లు, మార్చి నెల మొత్తం మీద రూ.39.04 కోట్లు వసూలు చేసినట్టు అధికారులు తెలిపారు. ఈ జోన్‌లో రెండో ఆదాయ కేంద్రంగా గుర్తించబడ్డ ఖైరతాబాద్ సర్కిల్‌లో రూ.170.68 కోట్ల పన్ను లక్ష్యం ఉండగా అందులో రూ. 162.07 కోట్లు వసూలు చేసినట్టు అధికారులు తెలిపారు.

బీజేపీ సనత్‌నగర్ జాయింట్ కన్వీనర్‌గా మహేష్‌కుమార్



సనత్‌నగర్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): బీజేపీ సనత్‌నగర్ నియోజకవర్గ జాయింట్ కన్వీనర్‌గా టీకేగుడాకు చెందిన ఆకుల మహేష్‌కుమార్ నియమితులయ్యారు. ఈమేరకు మహంకాళి సికింద్రాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు బురుగుల శ్యాంసుందర్ గౌడ్ నియామకం చేశారు. ఆకుల మహేష్ కుమార్ గతంలో పలు పదవులు చేపట్టగా ప్రస్తుతం మహంకాళి సికింద్రాబాద్ జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యుడిగా ఉన్నారు. తన మీద నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన కేంద్ర మంత్రి వర్యులు, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు శ్రీ కిషన్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బురుగుల శ్యాంసుందర్ గౌడ్, సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ కన్వీనర్ టి.రాజశేఖర్‌రెడ్డి, బీజేపీ సనత్‌నగర్ నియోజకవర్గ కన్వీనర్ శ్రీశైలం గౌడ్, రాష్ట్ర నాయకులు లింగంపల్లి నర్సింగ్ రావుకు ఈ సందర్భంగా ఆకుల మహేష్ కుమార్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.



- రహ్మత్‌నగర్‌లోని మసీజీద్ - ఈ -బిలాల్‌లో సోమవారం నిర్వహించిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, మాజీ టీమ్ ఇండియా కాప్టెన్ మహ్మద్ అజారుద్దీన్, రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి తదితరులు
  - యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి)



హోటల్ మెర్క్యురీలో సోమవారం జరిగిన ఇఫ్తార్‌లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకుడు మహ్మద్ ఫిరోజ్ ఖాన్, సుచీరిండియా చైర్మన్ లయన్ కిరణ్ తదితరులు
- బంజారాహిల్స్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి)



రహ్మత్‌నగర్ బంగారు మైసమ్మ దేవాలయం వద్ద రూ.20లక్షలతో జరుగుతున్న రోడ్డు పనులను పరిశీలిస్తున్న రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి తదితరులు.
- యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి)



ట్రోఫీతో శాన్వి

బ్యాడ్మింటన్ చాంప్ శాన్వి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తమిళనాడు ఓపెన్ సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ టోర్నీలో మణికొండ అమ్మాయి ఎల్.శాన్వి అండర్-9 విభాగంలో చాంపియన్‌గా నిలిచింది. చెన్నైలో జరిగిన ఈ పోటీల ఫైనల్లో శాన్వి 21-19, 18-21, 21-14తో రియాపై గెలిచింది. అండర్-11 విభాగంలో సెమీఫైనల్లో శాన్వి 22-24, 19-21 పోరాడి ఓడింది.

పవర్‌లిఫ్టింగ్‌లో శిల్పకు రజతం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో హైదరాబాద్ లిఫ్టర్ డి.శిల్ప రజతపతకం సాధించింది. సోమవారం ఢిల్లీలో జరిగిన పోటీల్లో మాస్టర్స్ విభాగం 90 కిలోల విభాగంలో శిల్ప ద్వితీయ స్థానంలో నిలిచింది. శిల్ప స్క్వాట్‌లో 85, బెంచ్‌లో40, డెడ్‌లిఫ్ట్‌లో102.5, మొత్తంగా 227.5 కిలోల బరువెత్తి రజతంతో మెరిసింది. రుచి(ఢిల్లీ) స్వర్ణం సాధించింది. తెలంగాణ డబ్ల్యూపీసీ పవర్‌లిఫ్టింగ్ సంఘం అధ్యక్షురాలు ఇంటూరి రేఖ, శిల్పను అభినందించింది.

ముగిసిన సంగీత, నృత్య మహోత్సవం

మియాపూర్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలిలోని సీసీఆర్‌టీలో సంగీత, నృత్య మహోత్సవం రామాయణ కల్పవృక్షం సోమవారంతో ముగిసింది. ఈఉత్సవాల్లో ప్రసిద్ధి చెందిన కళాకారులు తమ అద్భుత ప్రదర్శనతో ప్రేక్షకులను అలరించారు. చర్చలు, వర్క్‌షాపులు, సంస్కృతం, డిజిటల్ కళలు, పుస్తక ఆవిష్కరణలను చేశారు. చివరిరోజు కార్తీక్ అయ్యర్ త్రిల్లింగ్ సంగీతం ప్రేక్షకులను విశేషంగా అలరించింది. రిజాయిసింగ్ ఇన్ రఘు బ్యాండ్ ఫ్యూజన్ కార్ణటక సంగీతం అందరినీ మంత్రముగ్ధులను చేసింది. రామాయణ కల్పవృక్షం క్యూరేటర్ ఆనందశంకర్‌జయంత్ మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక గురువులు తమ వీడియో సందేశాలను పంపడం సంతోషంగా ఉందన్నారు.

విద్యార్థులు విద్య, సాంకేతిక రంగాల్లో రాణించాలి

- ప్రముఖ విద్యావేత్త నాగేంద్ర ప్రతాప్



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న అతిథులు

రవీంద్రభారతి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంతో పోటీ పడాలంటే ఈతరం విద్యార్థులు విద్యతో పాటు సాంకేతిక రంగంలో రాణించాలని ప్రముఖ విద్యావేత్త నాగేంద్ర ప్రతాప్ అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో సీఎస్‌ఏపీఎస్ మొదటి వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నాగేంద్ర ప్రతాప్ పలు రంగాల్లో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో విద్యార్థులు పరీక్షలంటే భయాందోళనకు గురవుతున్నారని అన్నారు. ఈ విధానాన్ని మార్చుకోవాలని పిలుపునిచ్చారు. పరీక్షా సమయంలో తల్లిదండ్రులు, గురువులు విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. విద్యతో పాటు సాంస్కృతిక, క్రీడా రంగాల్లో కూడా విద్యార్థులు రాణించేలా శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నారాయణ స్కూల్ హైదరాబాద్ జోన్ జీఎం గోపాల్‌రెడ్డి, జీ టెట్ ఉపాధ్యక్షుడు రవి పింగళి, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



పికెట్‌లోని శ్రీపంచభూత భూమేశ్వరస్వామి శివాలయంలో మహర్షి పతంజలి ఉత్సవాల్లో భాగంగా పూజలు నిర్వహిస్తున్న నిర్వాహకులు జెట్టి ఉమేశ్వరరావు, భక్తులు

ఘనంగా మహర్షి పతంజలి జయంతి

మారేడుపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : 196 యోగా సూత్రాలు ఆవిష్కరించిన మహర్షి పతంజలి జయంతి ఉత్సవాలు సోమవారం పికెట్‌లోని శ్రీపంచభూత భూమేశ్వర స్వామి శివాలయంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం 3గంటల నుంచి 5గంటల వరకు మహర్షి పతంజలి చరిత్ర, 196 యోగా సూత్రాలు, జపాలను ఆడియో ద్వారా భక్తులకు వినిపించినట్లు ఆలయ నిర్వాహకులు గురుజీ జెట్టి ఉమేశ్వరరావు పేర్కొన్నారు. మహర్షి ఆవిష్కరించిన యోగ సూత్రాలు జపాలు, చరిత్రను విన్న భక్తులు భక్తిపారవశ్యంతో ఉప్పొంగిపోయారు.



నియామక పత్రాన్ని స్వీకరిస్తున్న చీర శ్రీకాంత్

బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడిగా చీర శ్రీకాంత్

రాంగోపాల్‌పేట్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చ ఉపాధ్యక్షుడిగా రాంగోపాల్‌పేట్ డివిజన్‌కు చెందిన బీజేపీ సీనియర్ నేత చీర శ్రీకాంత్ (సత్యనారాయణ) నియమించబడ్డారు. రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షుడు గంధమల్ల ఆనంద్ ఈమేరకు సోమవారం నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చీర శ్రీకాంత్ మాట్లాడుతూ... తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పజెప్పినందుకు రాష్ట్ర అధ్యక్షుడు గంగారపు కిషన్‌రెడ్డికి, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్‌కు, రాష్ట్ర ఓబీసీ మోర్చ అధ్యక్షుడు గంధమల్ల ఆనంద్, మహంకాళి సికింద్రాబాద్ జిల్లా అధ్యకులు బూర్గుల శ్యామ్‌సుందర్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డిలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.



అల్వాల్ చౌరస్తాలో ఏర్పాటుచేసిన చెక్‌పోస్ట్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

పోలీసుల తనిఖీలు ముమ్మరం

అల్వాల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా ఎన్నికలకు సంబంధించిన కోడ్‌ను పక్కాగా అమలు పరిచేవిధంగా పోలీసులు చర్యలు చేపడుతున్నారు. అల్వాల్ ఈ-సేవా చౌరస్తా వద్ద అల్వాల్ పోలీసులు ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద సోమవారం వాహనాలను ఆపి పోలీసులు తనిఖీలను నిర్వహిస్తున్నారు.



వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న వసంత, గోపాలకృష్ణ తదితరులు

విద్యావాహిని హైస్కూలులో వైజ్ఞానిక ప్రదర్శన

అడ్డగుట్ట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): అడ్డగుట్టలోని విద్యావాహిని హైస్కూల్లో సోమవారం వైజ్ఞానిక ప్రదర్శనను నిర్వహించారు. సత్యసాయి సేవాసమితి (మారేడుపల్లి శాఖ) కన్వీనర్ వసంత, ట్రస్ట్ ప్రతినిధి గోపాలకృష్ణలు ఈ ప్రదర్శనలో ముఖ్యఅతిథులుగా పాల్గొని విద్యార్థులు తయారుచేసిన నమూనాలను తిలకించారు. స్కూల్ ప్రిన్సిపాల్ సంధ్యారాణి, శివకుమార్‌తోపాటు విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న అధ్యక్షుడు చిలుకు స్వామి, ఉపాధ్యక్షుడు రామ్మోహన్ తదితరులు

మృతుడి కుటుంబానికి రూ.5లక్షల చెక్కు అందజేత

దక్షిణమధ్య రైల్వే ఉద్యోగుల సహకార పరపతి పరిమితి సంఘం ఆర్థిక సహాయం

రెజిమెంటల్‌బజార్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సీనియర్ లోకో పైలెట్ బాలకృష్ణ కుటుంబానికి దక్షిణమధ్య రైల్వే ఉద్యోగుల సహకార పరపతి పరిమితి సంఘం ఆర్థిక సహాయం అందించింది. సోమవారం మృతుడి కుటుంబ సభ్యులకు రూ.5లక్షల చెక్కును అధ్యక్షుడు చిలుకుస్వామి, ఉపాధ్యక్షుడు రామ్మోహన్ అందించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు చిలుకుస్వామి మాట్లాడుతూ...షేర్ హోల్డర్‌లు ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవడానికి దక్షిణమధ్య రైల్వే ఉద్యోగుల సహకార పరపతి పరిమితి సంఘం అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ డైరెక్టర్‌లు, డెలిగేట్స్ తదితరులు పాల్గొన్నారు.

నడిరోడ్డుపై మురుగు ప్రవాహం

- దుర్గంధ భరితంగా రహదారులు
- తాత్కాలిక మరమ్మతులతో సరిపెడుతున్న అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు



మ్యాన్‌హోల్ నుంచి పొంగిపొర్లుతున్న మురుగులో వెస్ట్‌మారేడ్‌పల్లి ప్రధాన రోడ్డు

మారేడుపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : మోండా డివిజన్ పరిధిలోని మారేడుపల్లి ప్రధాన రహదారిలో గల కెనడి ప్రాథమిక విద్యాలయం ముందు గత ఎనిమిది సంవత్సరాలుగా మాన్యువల్ నుంచి మురుగు నీరు ఏరులై పారుతుంది.

మారేడుపల్లి జలమండలి అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారు. ప్రధాన రోడ్ల నిండా మురుగు నీరు కుంటను తలపించేలా ఏరులై పారుతుంది. దీంతో పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా మారాయి.

దుర్వాసన భరించలేక వాహనదారులు, పాదచారులు రోడ్లకు ఇరువైపులా ఉన్న వ్యాపారులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. ప్రాథమిక పాఠశాలకు చెందిన వందలాదిమంది విద్యార్థులు ఈ మురుగు నీటి మీద నుంచే పాఠశాలకు వెళ్లవలసిన వస్తుంది. మారేడుపల్లి నెహ్రూనగర్‌లో డ్రైనేజీ వ్యవస్థను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసే సమయంలో కెనడీ పాఠశాల ముందు తరచూ పొంగిపొర్లుతున్న మాన్యువల్ వద్ద ప్రణాళికాబద్ధమైన పనులు చేపట్టకపోవడం ఇందుకు కారణమని స్థానికవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా వ్యాపారాలు చేసుకోవాలి



ట్రాఫిక్ ఏసీపీతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

రెజిమెంటల్‌బజార్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ఫుట్‌పాత్ వ్యాపారులు పాదచారులు, వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా వ్యాపారాలు చేసుకోవాలని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సోమవారం మోండా డివిజన్ పాలికబజార్‌లో ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులతో కలిసి పర్యటించారు. ఫుట్‌పాత్ వ్యాపారులు రోడ్లు అక్రమించి వ్యాపారాలు సాగిస్తుండటంతో సాధారణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు ఎమ్మెల్యేకు వివరించారు. నిర్దేశించిన స్థలం దాటి ఫుట్‌పాత్ వ్యాపారులు బయటకు రావద్దని వ్యాపారులకు సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా రోడ్ల మీద వ్యాపారాలు చేసుకునే తోపుడు బండ్లపై పోలీసులు చర్యలు తీసుకుంటే ఫుట్‌పాత్ వ్యాపారులు జోక్యం చేసుకోవద్దని తెలిపారు. 40,50 సంవత్సరాలుగా ఫుట్‌పాత్ వ్యాపారాలు చేసుకుంటు జీవనం సాగిస్తున్న వారు పాదచారులకు, వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా చూసుకునే బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఆకుల రూప, మహంకాళి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఉపశంకర్, మార్కెట్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు నాగులు, హరిక్రిష్ణ, అత్తిలి శ్రీనివాస్‌గౌడ్, అసోషియేషన్ సభ్యులు అశోక్, బబ్లూ తదితరులు పాల్గొన్నారు.

కాప్రాసర్కిల్‌లో రూ.58.60 కోట్ల ఆస్తిపన్ను వసూలు

- చివరి రోజున రూ.3.23 కోట్లు
- ఎర్లీబర్డ్ ఆఫర్ ప్రారంభం

కాప్రా, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ కాప్రాసర్కిల్‌లో 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.58.60 కోట్ల ఆస్తిపన్ను వసూలైంది. కాప్రా, ఏఎస్‌రావునగర్, చర్లపల్లి, హెచ్‌బీ కాలనీ, మల్లాపూర్, నాచారం డివిజన్‌లలోని 57,004 అసెస్‌మెంట్ల నుంచి అధికారులు పన్నులు వసూలు చేశారు. సర్కిల్‌కు రూ.65.63 కోట్ల ఆస్తిపన్ను వసూలు చేయాలని ఉన్నతాధికారులు టార్గెట్ విధించగా ఇందులో 83 శాతం పన్నులు వసూలయ్యాయి. గడువు చివరి రోజు ఆదివారం అర్ధరాత్రి వరకు పన్నుల చెల్లింపులు జరిగాయి. ఈ ఒక్కరోజే రూ.3.23 కోట్ల ఆస్తిపన్ను వసూలైంది. మొత్తం ఆసిపన్నులో సిటిజన్ సర్వీస్ సెంటర్ ద్వారా రూ 8.42 కోట్లు, బిల్ కలెక్టర్ల ద్వారా ఆన్‌లైన్‌లో రూ.3.02 కోట్లు, ఆఫ్‌లైన్‌లో క్యాష్, చెక్కులు, డీడీల రూపంలో రూ.25.22 కోట్లు, మీ సేవా ద్వారా రూ.2.52 కోట్లు, ఆన్‌లైన్ ద్వారా (అదర్ హ్యాండ్ హెల్డ్ మిషన్స్) రూ.19.40 కోట్ల ఆస్తిపన్ను వసూలైందని ఎల్బీనగర్ ఇన్‌చార్జి జోనల్ కమిషనర్, సర్కిల్ డీసీ ముకుందరెడ్డి సోమవారం తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను ఆస్తిపన్నుకు సంబంధించిన ఎర్లీబర్డ్ ఆఫర్ సోమవారం నుంచి ప్రారంభమైందని, ఈ నెలాఖరులోగా ఆస్తిపన్ను చెల్లించిన వారికి 5శాతం రాయితీ లభిస్తుందని ఆయన తెలిపారు. సర్కిల్ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

సనత్‌నగర్ బీజేపీ జాయింట్ కన్వీనర్‌గా ఆకుల మహేష్ నియామకం



సనత్‌నగర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సనత్‌నగర్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్‌గా టీకేగూడకు చెందిన ఆకుల మహేష్‌కుమార్‌ని నియమిస్తూ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షులు బురుగుల శ్యాంసుందర్‌గౌడ్ నియమించారు. ఆకుల మహేష్‌కుమార్ గతంలో బీజేపీ బూత్ అధ్యక్షులుగా, అమీర్‌పేట డివిజన్ యువమోర్చా కార్యదర్శిగా, అమీర్‌పేట డివిజన్ యువమోర్చా అధ్యక్షులుగా, సనత్‌నగర్ నియోజకవర్గ యువమోర్చా కన్వీనర్‌గా, బల్కంపేట్ డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శిగా, యువమోర్చా తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా, యువ మోర్చా గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షులుగా, ప్రస్తుతం మహంకాళి సికింద్రాబాద్ జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యులుగా బాధ్యత నిర్వహిస్తున్నారు. తనమీద నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన కేంద్ర మంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు కిషన్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు బురుగుల శ్యాంసుందర్‌గౌడ్, సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ కన్వీనర్ టి.రాజశేఖర్ రెడ్డి, సనత్‌నగర్ నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ శ్రీశైలంగౌడ్, రాష్ట్ర నాయకులు లింగంపల్లి నర్సింగ్‌రావులకు ఈ సందర్భంగా ఆకుల మహేష్ కుమార్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

బస్సు ఢీకొని గాయపడిన మహిళ మృతి

అఫ్జల్‌గంజ్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతున్న ఓ మహిళను ఆర్టీసీ బస్సు ఢీ కొట్టడంతో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందిన సంఘటన షాహినాథ్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం... సుమారు 60 ఏళ్ల ఓ మహిళ ముస్లింజంగ్ పూల్ వంతెన వద్ద ఉన్న ఫుట్‌పాత్‌లపై నివసిస్తుండేది. గత నెల 30న రాత్రి ముస్లింజంగ్ వంతెన దాటుతుండగా వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. ఈ సంఘటనలో మహిళకు బలమైన గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. మృతురాలికి సంబంధించి ఎవరైనా ఉంటే పోలీసులను సంప్రదించాలన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సరుకు రవాణాకు సిద్ధం చేస్తున్న రైల్వే సిబ్బంది

సరుకు రవాణాలో దక్షిణమధ్య రైల్వే రికార్డు


సికింద్రాబాద్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గడిచిన ఆర్థిక సంవత్సరంలో సరుకు రవాణ రంగం, సరుకు రవాణ ఆదాయంలో దక్షిణమధ్య రైల్వే అత్యుత్తమ పనితీరు ప్రదర్శించింది. మునుపెన్నడూ లేనివిధంగా తొలిసారిగా సరుకు రవాణాలో 140 మిలియన్ టన్నుల మార్కును అధిగమించి 141.117 మిలియన్ టన్నుల సరుకు లోడింగ్ సాధించింది. గత ఏడాదితో పోలిస్తే 8.785 మిలియన్ టన్నులు అధికం కావడం గమనార్హం. అలాగే 2023-24 ఆర్థిక సంవత్సరంలో సరుకు రవాణా ఆదాయంలో మొట్టమొదటిసారిగా 13వేల కోట్ల రూపాయల మార్కును అధిగమించి, 13,438.76 కోట్ల రూపాయలను ఆర్జించింది. గత ఏడాదితో పోలిస్తే 506 కోట్ల రూపాయలను అధికంగా ఆర్జించడం విశేషం. బొగ్గు, సిమెంట్, ఎరువుల, ఆహార ధాన్యాల రవాణాలో వృద్ధి కారణంగా దక్షిణమధ్య రైల్వే ఈ ఘనత సాధించినట్టు అధికారులు వెల్లడించారు. జోన్‌లో సరుకు రవాణాలో ప్రధాన వస్తువైన బొగ్గును 2022-23లో 67.18మిలియన్ టన్నులు రవాణా చేయగా, 2023-24లో 70.522 మిలియన్ టన్నుల లోడింగ్ చేసింది. రెండో అతి పెద్ద రవాణా వస్తువైన సిమెంట్‌ను 2022-23లో 34.855 మిలియన్ టన్నుల లోడింగ్ చేయగా, 2023-24లో 36.117 మిలియన్ టన్నుల లోడింగ్ చేసింది.

అంతర్గత విద్యుత్ సమస్యలకు బాధ్యులను చేయొద్దు

- తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జాయింట్‌యాక్షన్ కమిటీ

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరా అంతరాయాలకు తమ తప్పిదం లేకున్నా.. విద్యుత్ సంస్థల యాజమాన్యాల, అధికారుల, ఇంజనీర్ల సిబ్బంది లోపంగా అసత్య ప్రచారం చేస్తూ, అంతర్గత విద్యుత్ సమస్యలకు తమను బాధ్యులను చేయొద్దని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ కోరింది. జేఏసీ ఆధ్వర్యంలో ఖైరతాబాద్ మింట్ కాంపౌండ్ తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్-1104 కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. జేఏసీ చైర్మన్ సాయిబాబా, కన్వీనర్ పి.రత్నాకర్‌రావు, కోకన్వీనర్ పి.బీసీ.రెడ్డి, వేణుగోపాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని కేటగిరీల్లో నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు తామంతా అహర్నిశలు కృషిచేస్తున్నామని తెలిపారు. తమకు సంబంధం లేని అంతర్గత సాంకేతిక సమస్యల కారణంగా సరఫరాలో అంతరాయం ఏర్పడినా, దాన్ని తమ తప్పిందగా చూపిస్తూ తప్పుడు ప్రచారం చేయడం విద్యుత్ సిబ్బంది, అధికారుల మనోధైర్యం దెబ్బతీస్తుందని వారు అన్నారు. ప్రస్తుత సీజన్లో అంచనాలకు మించి డిమాండ్ వస్తున్నా తమ సిబ్బంది, ఇంజనీర్లు అనునిత్యం అప్రమత్తంగా ఉంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో గతేడాది 15,497 మెగావాట్లుగా ఉన్న గరిష్ఠ విద్యుత్ డిమాండ్ ఇప్పటికే 15,623 మెగావాట్లకు చేరిందన్నారు. డిమాండ్ పెరిగినా విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయాలు లేకుండా పనిచేస్తున్నామన్నాని, భవిష్యత్‌లో మరింత డిమాండ్ పెరిగినా నిరంతర విద్యుత్‌సరఫరా చేస్తామన్నారు.

తాగునీటి సరఫరాకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, అధికారులు

మేడ్చల్ ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో తాగునీటి సరఫరాకు ఇబ్బందులు కలుగకుండా తగిన చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు. తాగునీటి సరఫరా, ధాన్యం కొనుగోలు, పాఠశాల మౌలిక వసతుల కల్పనపై సోమవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో పక్కా ప్రణాళికతో తాగునీటి సరఫరా జరుగుతున్నదని, ప్రతి గ్రామానికి నీటి సరఫరా కార్యాచరణ రూపకల్పన చేశామని, నాణ్యమైన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో మద్దతు ధరపై కొనుగోలుకు ఏర్పాట్లు చేశామని, పాఠశాలల్లో మౌలిక వసతుల పనులు అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పూర్తిచేయనున్నట్లు కలెక్టర్ వివరించారు. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బ నియంత్రణ చర్యలు కూడా చేపడుతున్నట్లు తెలిపారు. డీఈఓ విజయకుమారి, డీఎంహెచ్ఓ రఘునాథస్వామి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

టోల్‌ఫ్రీ నంబర్ 1950..

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఓటర్ వివరాల కోసం కలెక్టరేట్‌లో టోల్‌ఫ్రీ నంబర్ 1950 ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కంట్రోల్ రూమ్‌లో సిబ్బంది, పోలింగ్ స్టేషన్‌ల నంబర్‌లు కూడా అందుబాటులో ఉంటాయన్నారు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఓటర్ వివరాలు అందుబాటులో ఉంచామని తెలిపారు. ఫారం 6,7,8 గూర్చి సంక్షిప్త సమాచారం, ఓటర్ ఐడీ వివరాలు, పోలింగ్ స్టేషన్‌ల వివరాలు, ఎపిక్ కార్డు వివరాలు, ఏఆర్‌ఓ, ఇఆర్, బీఎల్‌ఓ, సూపర్‌వైజర్స్ తదితర వివరాలు తెలుసుకోవచ్చునన్నారు.



మేడ్చల్ పోలీస్ ట్రైనింగ్ కాలేజీ పోలీసులకు సూచనలుచేస్తున్న బోయిన్‌పల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగయ్య

పోలీసులు విధులను బాధ్యతతో నిర్వర్తించాలి

బోయిన్‌పల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పోలీసులు తమ విధులను బాధ్యతతో నిర్వహించాలని, మర్యాద, విధేయత, నిజాయితీ, దేశభక్తి, ధైర్యం, సమర్థత కలిగి ఉండాలని శిక్షణలో ఉన్న పోలీస్ ట్రైనింగ్ కాలేజీ పోలీసులకు బోయిన్‌పల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగయ్య సూచించారు. మేడ్చల్‌లో ఉన్న పోలీస్ ట్రైనింగ్ కాలేజీ పోలీసుల శిక్షణలో భాగంగా ఒకరోజు శిక్షణా తరగతులు సోమవారం బోయిన్‌పల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగయ్య ఆధ్వర్యంలో బోయిన్‌పల్లిలో నిర్వహించారు. ఈ శిక్షణా తరగతులలో 61 మంది పీటీసీ శిక్షణలో పోలీసుల బ్యాచ్ పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు విధులలో ఎలా ఉండాలి, సమాజంలో ప్రజల పట్ల ఎలా వ్యవహరించాలి పలు సూచనలతో పాటు, భారత రాజ్యాంగానికి పోలీసులు విధేయులై ఉండాలన్నారు. పౌరులకు రాజ్యాంగం అభయమిచ్చిన హక్కులని సమర్థించి నిలబెట్టే ప్రయత్నం చేయాలని వాటిని గౌరవించాలి అన్నారు. తమను నమ్మేవిధంగా నిష్పక్షపాతంగా పోలీసలు ఉండాలి. పోలీసులు గౌరవంగా ఉండాలి. ధైర్యంగా ఉండాలి. ప్రజల నమ్మకాన్ని పొందేవిధంగా పోలీసులు తమ నడవడికను రూపొందించుకోవాలని చెప్పారు. నేరాలు జరగకుండా నిరోధించడం, శాంతి భద్రతల క్రమంలో ఉంచడం అనేది పోలీసుల ప్రాథమిక విధి. వీటిని విధిగా నిర్వర్తించడమే పోలీసుల సామర్థ్యానికి నిదర్శనం. అంతేకాని వాటిని పరిష్కరించడం వారి సాక్ష్యానికి సాక్ష్యం కాదు అని పలు విషయాలను చెబుతూ పోలీసుల బాధ్యతను గుర్తు చేస్తూ సలహాలను అందించారు. కార్యక్రమంలో ఎస్ఐ ప్రభాకర్ రెడ్డి, బోయిన్‌పల్లి తర్ఫీ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మానసిక స్థితి బాగాలేని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసుల కథనం ప్రకారం... బొల్లారం బజార్, ఆదర్శనగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్న నాగరాజు(30)కు గత మూడు నెలలుగా మతిస్థిమితం సరిగా ఉండటం లేదు. ముగ్గురు అన్నదమ్ములు కాగా, పెద్దవాడు నాగరాజు. తండ్రి చనిపోవడంతో అందరూ కలిసే ఉంటున్నారు. మద్యానికి బానిసైన ఇతడు ఇంటివద్దనే ఉంటుండేవాడు. ఇతడు తరచుగా ఇంటి నుంచి బయటకు వెళ్లడం తిరిగి వస్తుండటం చేస్తుంటాడు. అయితే ఆదివారం ఇంటి వద్ద నుంచి బయటకు వెళ్లాడు. సోమవారం ఉదయం 8 గంటలకు బొల్లారం బజార్ రైల్వేస్టేషన్లో ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్పీ పోలీసులకు సమాచారమందింది. ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు మృతదేహాన్ని గాంధీమార్చురీకి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు.

రైలు ఢీకొని పట్టాలు దాటుతున్న వ్యక్తి మృతి

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పట్టాలు దాటుతున్న వ్యక్తిని రైలు ఢీకొని మరణించాడు. సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసుల కథనం ప్రకారం... మహారాష్ట్రకు చెందిన అశోక్ బాబు(25) మేస్త్రీగా పనిచేస్తున్నాడు. గత నాలుగేళ్ల క్రితం బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి కొంపల్లిలో భార్య, కుమారుడితో కలిసి నివాసం ఉంటున్నాడు. అయితే ఆదివారం సాయంత్రం ఇంటి వద్ద నుంచి మద్యం తాగి వచ్చేందుకు బయటకు వెళ్లిన అతడు రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతిచెందాడు. సోమవారం ఉదయం 9గంటల సమయంలో గుండ్లపోచంపల్లి బొల్లారం రైల్వేస్టేషన్ల మధ్య రైలు పట్టాలపై ఓ వ్యక్తి మృతదేహం ఉన్నట్లుగా రైల్వే కీమ్యాన్ గుర్తించాడు. ఈ విషయాన్ని జీఆర్పీ పోలీసులకు తెలియజేశాడు. జీఆర్పీ పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పరిశీలించగా, మృతుడి జేబులో ఉన్న ఆధార్ గుర్తింపుకార్డు ఆధారంగా మృతుడిని అశోక్‌బాబుగా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మద్యం తాగేందుకు వెళ్లిన అతడు రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతిచెందినట్లుగా గుర్తించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

బోయిన్‌పల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని సుచిత్ర ఎంఎంటిఎస్ రైల్వే స్టేషన్ వద్ద గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ నాగేంద్రబాబు తెలిపిన వివరాల ప్రకారం... బోయిన్‌పల్లి నుంచి మేడ్చల్ వెళ్లే రహదారి పక్కన ఉన్న మిలటరీ డైరీఫామ్ చౌరస్తా సమీపంలో సుచిత్ర ఎంఎంటిఎస్ రైల్వేస్టేషన్ ఉంది. ఈ ప్రాంతంలో ఓ గుర్తు తెలియని మృతదేహం ఉందని, అది సగం కుళ్లిపోయి ఉందని, దుర్వాసన వస్తుందని రైల్వే గార్డ్ బోయిన్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మట్టిలో ఉన్న మృతదేహాన్ని బయటకుతీసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతదేహం సగభాగం కుళ్లిన స్థితిలో ఉన్నట్లు, సుమారు 3, 4 రోజుల క్రితమే చనిపోయినట్లు తెలుస్తుందని మృతుడు సుమారుగా 40 నుంచి 45 సంవత్సరాల వయస్సు ఉన్నట్లు తెలిపారు. మృతునికి సంబంధించి ఏదైనా సమాచారం ఉంటే బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో సంప్రదించగలరని పోలీసులు వెల్లడించారు. కాగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఈ మృతదేహం ఎవరిది, ఎలా జరిగింది అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. కాగా రక్తపు మరకల ఆధారంగా మృతుడు జారి కిందపడి మృతిచెందినట్లుగా పోలీసు ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి అనుమానిస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తిని దూషించిన కేసులో నలుగురి అరెస్ట్

మంగళ్‌హట్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఓ వర్గానికి చెందిన మహిళను తన బైక్‌పై తీసుకెళుతున్నాడని గమనించిన ఐదుగురు యువకులు వారిని అటకాయించి అసభ్య పదజాలంతో దూషించడంతో పాటు దాడి చేసేందుకు ప్రయత్నించిన నిందితులను సోమవారం అబిడ్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. కేపీహెచ్‌బీ ప్రాంతానికి చెందిన బి.సునీల్ తన బంధువు వరలక్ష్మి స్నేహితురాలైన ఫర్హానాను గత నెల 20న ద్విచక్ర వాహనంపై అబిడ్స్ గృహకల్ప నుంచి చార్మినార్ వైపు వెళ్తుండగా గమనించిన ఐదుగురు యువకులు ద్విచక్ర వాహనాలపై వెంబడించి వారిని వాహనాన్ని అటకాయించి సునీల్, వరలక్ష్మీలను అసభ్యపదజాలంతో దూషించారు. ఓ క్రమంలో దాడి చేసేందుకు ప్రయత్నించారు. తమ వర్గానికి చెందిన మహిళను నీ వాహనం ఎందుకు తీసుకెళుతావంటూ దుర్భాషలాడారు. దీంతో బాధితులు సునీల్, వరలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసుకొని సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితులు మహ్మద్ అబ్బాస్, సయ్యద్ ఇమ్రాన్, మహ్మద్ హసీముద్దీన్‌లను అదుపులోకి తీసుకున్నారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

డ్రైవర్‌ను ఢీకొన్న లారీ

మదీన, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు పక్కన లారీని నిలిపి..టైర్లలో గాలి చెక్ చేసుకుంటున్న డ్రైవర్‌ను మరో వాహనం ఢీకొనడంతో అతనికి తీవ్రగాయాలయ్యాయి. బహదూర్‌పురా పోలీసులు తెలిసిన వివరాల ప్రకారం... ముషీరాబాద్‌కు చెందిన అబ్దుల్ జబార్(50)లారీ డ్రైవర్. సోమవారం సాయంత్రం జూపార్కు ఎదురుగా మెయిన్ రోడ్డుపై తన లారీని ఆపి టైర్లలో గాలి చెక్ చేస్తున్నాడు. ఆ సమయంలో కేరళకు చెందిన లారీ (కెఎల్ 40టీ 9013 నంబర్) రోడ్డుపైనున్న అబ్దుల్ జబ్బార్‌ను రాసుకుంటూ వెళ్లింది. దాంతో అతను తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు గమనించి జబ్బార్‌ను ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించారు. నిర్లక్ష్యంగా లారీని నడిపిన డ్రైవర్ అమర్‌దేవ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల తనిఖీలో 19 బీర్ కార్టన్లు స్వాధీనం

అఫ్జల్‌గంజ్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నేపథ్యంలో షాహినాథ్‌గంజ్ పోలీసుల తనిఖీల్లో 19 బీర్ కార్టన్లు పట్టుబడ్డాయి. షాహినాథ్‌గంజ్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం మంగళ్‌హట్ ప్రాంతానికి చెందిన ఆకాశ్ సింగ్ ఆటోలో 19 బీర్ బాటిళ్ల కార్టన్లను జీస్సీచౌరాయి నుంచి మంగళ్‌హట్‌కు తరలిస్తున్నాడు. పోలీసులు జీస్సీచౌరాయి వద్ద తనిఖీలు చేస్తుండగా ఆటో పట్టుబడింది. ఆటోలో తనిఖీలు చేయగా 19 బీర్ బాటిళ్ల కార్టన్లు లభ్యం కావడంతో స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.